క్లుప్తంగా

వృద్ధాశ్రమంలో అన్నదానం



తెనాలి అర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ సభ్యులు పాదర్తి వెంకటేశ్వరరావు, ఆదిలక్ష్మి దంపతులు సోమవారం నాజర్‌పేటలోని మన ఇల్లు వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానంతో పాటు బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల కృష్ణమోహనరావు, క్లబ్ వ్యవస్థాపకులు కాకరపర్తి సుబ్రహ్మణ్యం, నంబూరు శ్రీకుమార్, అయినాల మల్లేశ్వరరావు, ఆశ్రమ నిర్వాహకులు చుండూరు భారతలక్ష్మి, చుండూరు విజయదుర్గ, ఎస్.సురేష్ పాల్గొన్నారు.

రంగిశెట్టి రమేష్‌కు ఛత్రపతి శివాజీ పురస్కారం



తెనాలి: జిల్లాలోని పొన్నూరులో గల పొన్నూరు బ్లడ్ డోనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెనాలికి చెందిన రంగిశెట్టి ఫౌండేషన్ అధ్యక్షుడు, కవి, రచయిత డాక్టర్ రంగిశెట్టి రమేష్ (గంగాశ్రీ)ను ఛత్రపతి శివాజీ మహరాజ్ పురస్కారంతో సత్కరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, ఒడిశా, తమిళనాడు, కర్ణాటకలకు చెందిన 90 మంది స్వచ్ఛంద సేవాసంస్థల నిర్వాహకులు, రక్తదాతలకు పురస్కారాలను ప్రదానం చేసి సత్కరించారు. రంగిశెట్టి ఫౌండేషన్, శ్రీకృష్ణదేవరాయల కళావేదిక చైర్మన్‌గా రమేష్ చేసిన సామాజిక సేవకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందజేశారు. సంస్థ వ్యవస్థాపకుడు తిరుమలశెట్టి ఉమాశంకర్ నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో పూర్వ నాసా శాస్త్రవేత్త డాక్టర్ చందు సాంబశివరావు, పార్వతీనాయుడు, నేషనల్ ఫండమెంటల్ లీగల్ రైట్స్ చైర్మన్ కె.కల్పన, ఆంధ్రశాఖ చైర్మన్ వసంత్ పాల్గొన్నట్టు పాల్గొన్నారు.

ఆలపాటికి న్యాయవాదుల అభినందన



తెనాలి రూరల్: ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను న్యాయవాదులు అభినందించి, సత్కరించారు. తెనాలి బార్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం ఆలపాటి అభినందన సభను న్యాయవాదులు నిర్వహించారు. ఆయన్ను సత్కరించి మెమెంటోను బహూకరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, సీనియర్ న్యాయవాదులు తాడిబోయిన శ్రీనివాసరావు, వెలినేని రాఘవయ్య, వెలివెల రమేష్‌బాబు, అన్నం పిన్నారావు, ఎం.ఎల్. జగదీశ్వరాంబ, మద్ది మల్లికార్జునరావు, కాకుమాను కనకరాంబాబు, ఇందుపల్లి రాజారాం పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొమ్మల మండపం వద్ద ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. ఈ ఘటనపై వాహన యజమాని సోమవారం తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు మేక నరేంద్రరెడ్డి వివరాల మేరకు.. తాడేపల్లి మెయిన్ రోడ్డులోని బొమ్మల మండపం వద్ద పాత పోస్టాఫీస్ ఎదురుగా తన ఇంటి ఆవరణలో బ్లాక్ కలర్ పల్సర్‌ను పార్క్ చేశాడు. గుర్తుతెలియని వ్యక్తులు తెల్లవారుజామున హ్యాండిల్ లాక్ తొలగించి ద్విచక్ర వాహనాన్ని దొంగిలించారు. ఈ సంఘటనపై తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు. తాడేపల్లి పట్టణ రూరల్‌లో గత కొంతకాలంగా ఇళ్ల ముందు, రోడ్లపై పార్కు చేసిన ద్విచక్ర వాహనాలు తరచు చోరీకి గురి అవుతున్నాయి. నెల రోజుల వ్యవధిలో సుమారు 15 ద్విచక్ర వాహనాల వరకు చోరీకి గురి అయినట్లు సమాచారం. దొంగిలించిన వాహనాలపై ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయడం లేదని విమర్శలొస్తున్నాయి.

ఆధార్ మొబైల్ క్యాంపులు

దుగ్గిరాల: మండలంలోని తొమ్మిది గ్రామాల్లో మార్చి 19 నుంచి 28వ తేదీ వరకు మొబైల్ ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆధార్‌లో పేర్ల తప్పులు, చిరునామాలోని మార్పులు చేర్పులు ఆధార్ లేని చిన్న పిల్లలకి కొత్తగా నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. ఆధార్ క్యాంపు అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాల్లో నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని ఆయన కోరారు.

నాడు కళకళ.. నేడు వెలవెల

- సచివాలయ వ్యవస్థకు మంగళం
- నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- సర్వేల పేరుతో ఉద్యోగులకు వేధింపులు



ఉద్యోగులు అందుబాటులో లేకపోవడంతో వెలవెలబోతున్న మున్సిపల్ కార్యాలయంలోని వార్డు సచివాలయం

తెనాలి అర్బన్: ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందించాలనే ఉద్దేశంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం నీరు గార్చుతోంది. నిత్యం సర్వేల పేరుతో ఉద్యోగులను ఇళ్లకు పంపుతోంది. సచివాలయంలో అందించాల్సిన సేవలకు మంగళం పాడుతోంది. కొత్త రేషన్ కార్డులు, పింఛన్‌ల కోసం సచివాలయాల చుట్టూ పలువురు తిరుగుతున్నారు. సమాధానం చెప్పలేక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు.

నాడు ప్రజల ముంగిట్లో సేవలు

తెనాలి పట్టణంలో 47 వార్డు సచివాలయాలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటిల్లో పని చేసేందుకు 370 మందిని వివిధ పోస్టుల్లో అధికారులు నియమించారు. యాభై ఇళ్లకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి ఇంటి డేటాను వారితో సేకరించారు. అర్హత ఉన్న వారికి ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పింఛన్లు పంపిణీ చేశారు. ధ్రువీకరణ పత్రాల జారీ, ఇంటి పన్నుల వసూలు వంటి వాటిని చేశారు. సంక్షేమ పథకాలకు అర్హులను ఎంపిక చేసి వారికి లబ్ధి చేకూర్చారు. ఇలా సచివాలయంలో సుమారు 545 సేవలు కొనసాగేవి. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు కాకముందు ప్రజలకు ఏదైనా సమస్య వస్తే ఆయా ప్రభుత్వ కార్యాలయాల అధికారులకు తెలియజేసి పరిష్కారం పొందేవారు. అధికారులు అందుబాటులో లేకపోతే ఇబ్బందులు పడేవారు. సచివాలయాల ఏర్పాటుతో ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం లభించేది. ప్రజలతో సచివాలయాలు కళకళలాడుతూ ఉండేవి.

సర్వేలతో సతమతం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ ఉద్యోగులను సర్వేల పేరిట వేధిస్తోంది. గతంలో వలంటీర్లతో ప్రభుత్వం ఏదైనా సర్వే చేయిస్తే గగ్గోలు పెట్టిన ప్రస్తుత పాలకులు నేడు సచివాలయ ఉద్యోగులను సర్వేల పేరిట ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ప్రస్తుతం పీ–4, వర్క్ ఫ్రం హోం, మిస్సింగ్ ఎంప్లాయ్ అండ్ సిటిజన్ ఇన్ హెచ్‌హెచ్, కాప్చరింగ్ ఆఫ్ హౌస్ ఇమేజ్ జియో కోఆర్డినేట్స్, డెత్ మార్క్‌డ్ సిటిజన్స్ అడాల్ట్ రిపోర్ట్, ఎన్‌పీసీపీ, విలేజ్ ప్రొఫైల్, నాన్ రెసిడెన్స్ ఏపీ, పీఏసీఎస్ ఈకేవైసీ, చిల్డ్రన్ విత్ అవుట్ ఆధార్ రిపోర్ట్, లెదర్ అర్టిసిన్స్ వంటి సర్వేలను చేయిస్తున్నారు. ఉద్యోగులు ఇళ్లకు వెళ్లి ఓటీపీలు చెప్పాలని కోరుతూ బతుకు జీవుడా అంటూ కాలం వెళ్లబుచ్చుతున్నారు.

పనిచేయని సర్వర్లు

కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ సేవలకు గ్రహణం పట్టింది.సంక్షేమ పథకాలు నిలిపి వేయడం...ఉద్యోగులను పలు సర్వేల పేరిట ఇళ్లకు పంపుతుండటంతో నేడు సచివాయాలు వెలవెలపోతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు దాటినా ఇప్పటి వరకు ఒక్క కొత్త పింఛన్, రేషన్ కార్డు ఇచ్చిన దాఖలాలు లేవు. కుటుంబ యజమాని చనిపోతే అతని భార్యకు తర్వాత నెల పింఛన్ మాత్రం ఇస్తున్నారు. మిగిలిన వారంతా ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చారు. కానీ నేటి ప్రభుత్వం కనీసం అర్హులైన వారి అప్లికేషన్లు కూడా తీసుకోవడం లేదు. వీటికి సంబంధించిన సర్వర్లు కూడా పని చేయడం లేదు. దీంతో ఏమి చేయాలో తెలియక ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. వెబ్‌సైట్ పనిచేయటం లేదని, అది ఓపెన్ అయిన తర్వాత తెలియజేస్తామని చెప్పి ప్రజలను వెనక్కి పంపుతున్నారు.

పట్టణంలో దోమల స్వైరవిహారం

నివారణకు చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ కలెక్టర్‌కు ప్రజల వినతి



అసిస్టెంట్ కలెక్టర్ పవర్ స్వప్నిక్ జగన్నాథ్‌కు సమస్యలు తెలియజేస్తున్న కౌన్సిలర్ , ఉడా కాలనీవాసులు

తెనాలి అర్బన్: పట్టణంలో దోమల సంచారం ఎక్కువగా ఉందని, పగటి పూట కూడా కుడుతున్నాయని, నివారణకు చర్యలు తీసుకోవాలని 30వ వార్డు కౌన్సి లర్ కొమ్మబత్తుని జయపాల్, ఉడా కాలనీవాసులు కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. 30వ వార్డులో పార్కు స్థలాన్ని అభివృద్ధి చేయాలని, కొత్త రోడ్లు నిర్మించాలని కోరుతూ అసిస్టెంట్ కలెక్టర్ పవర్ స్వప్నిక్ జగన్నాథ్‌కు వినతి పత్రం ఇచ్చారు. నీటి కుళాయి పన్నులను రద్దు చేయాలని 1వ వార్డు వాసి కోరారు. 7,11,15 వార్డు సచివాలయాల పరిధిలో రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలను తొలగించాలని పలువురు కోరారు. సమస్యల్ని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతిరావు, ఎసీపీ టి.శివన్నారాయణ, పలువురు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావనతో సమాజంలో శాంతి



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

తెనాలి టౌన్: ఆధ్యాత్మిక భావనతో సమాజంలో శాంతి వర్ధిల్లుతుందని శ్రీ రమాసహిత సత్యనారాయణస్వామి దేవస్థానం అర్చకులు రొంపిచర్ల మారుతీ చక్రవర్తి పేర్కొన్నారు. బోసు రోడ్డులోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో ఉన్న శ్రీ రమాసహిత సత్యనారాయణస్వామి అష్టమవార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ముగిశాయి. స్వామికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కుంభారాధన, అగ్ని ధ్యానం, విశేష హోమం, చక్రస్నానం, పూర్ణాహుతి, కుంభాభిషేకం, హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు నూకల వెంకట వేణుగోపాలరావు, ఇన్‌చార్జి కార్యదర్శి వక్కలగడ్డ గంగాధరరావు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు ప్రారంభం



తెనాలిలో హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



కొల్లిపర హైస్కూలులో పరీక్ష రాయటానికి సహాయకురాలితో వస్తున్న దివ్యాంగుడు

తెనాలి అర్బన్: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. తెనాలి పట్టణం, మండల పరిధిలోని 15 పరీక్ష కేంద్రాల్లో జరిగాయి. ఉదయం 8.30 గంటల నుంచే కేంద్రాల వద్దకు విద్యార్థులు తల్లిదండ్రులతో కలసి వచ్చారు. 9 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతించారు. అధికారులు కూడా విద్యార్థులు ఇబ్బంది పడకుండా హాల్ టికెట్ నెంబర్లు తెలియజేసే బోర్డులను ఏర్పాటు చేశారు. మంచినీరు, ఇతర వసతులు కల్పించారు. 9.30 గంటల నుంచి 12.45 వరకు పరీక్ష జరిగింది. మొదటి రోజు తెలుగు పరీక్ష జరిగింది. తెనాలి పరిధిలో 3,140 మందికి గానూ 3,112 మంది హాజరైనట్లు ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ తెలిపారు. ఫ్లైయింగ్ స్క్వాడ్లు కేంద్రాలను తనిఖీ చేసినట్లు ఆయన చెప్పారు.

కొల్లిపరలో..

మండలంలోని మూడు కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి.ఉదయం 8.30 గంటల నుంచే పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు తల్లిదండ్రులతో కలసి రావడంతో ఒక్కసారిగా అక్కడ వాతావరణం కోలాహలంగా మారింది. మండలంలో మొత్తం 424 మందికి గానూ 418 మంది పరీక్షలకు హాజరయ్యారు. వల్లభాపురం హైస్కూలులో 94 మందికి గానూ 89 మంది, అత్తోట హైస్కూలులో 103 మందికి గానూ 103 మంది, కొల్లిపర హైస్కూలులో 227 మందికి గానూ 226 మంది హాజరయ్యారు.ఆయా కేంద్రాల వద్ద ఎస్‌ఐ పి.కోటేశ్వరరావు ముందు జాగ్రత్త చర్యగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం



శాంతి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

ఫిరంగిపురం: మండలంలోని 113 తాళ్లూరు గ్రామంలో ఉన్న రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో నూతన జీవ ధ్వజస్తంభ ప్రతిష్ఠ సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం వైఖానస ఆగమ పండితులు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, ఉక్తహోమం, రత్నన్యాసం, అగ్నిధ్యానం, హోమం పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం పండితులు దీవి ఫణికుమార్, పవన్‌కుమార్, డీడీకే ఆచార్యులు, రఘురామ్, సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠ నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి శాంతి కల్యాణం నిర్వహించారు. పూజా కార్యక్రమంలో దాత, రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్, భువనేశ్వరి, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ రాజా దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమాలను ఈవో జె.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. అన్నదానం చేశారు.

పోలేరమ్మ సన్నిధిలో వజ్రబాబు

దామరపల్లి(తాడికొండ): మండలంలోని దామరపల్లిలో పోతురాజు, పోలేరమ్మ ఆలయ వార్షిక తిరునాళ్లను సోమవారం నిర్వహించారు. గ్రామంలో మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి ఆలయం వద్ద పొంగళ్లు చేసి మొక్కులు తీర్చుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతీ సంప్రదాయాలతో ఏటా దామరపల్లిలోని పోతురాజు, పోలేరమ్మ ఆలయంలో వార్షిక తిరునాళ్లను నిర్వహించడం హర్షణీయమన్నారు. గ్రామ సర్పంచ్ నల్లిబోయిన సరస్వతి, ఉప సర్పంచ్ గుడిమెట్ల సుజాత, బండారుపల్లి సర్పంచ్ ముప్పాళ్ళ మనోహర్, మాజీ సొసైటీ చైర్మన్ వంగా పోలారెడ్డి పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల సీజ్



పోలీసులకు పట్టుబడిన ట్రాక్టర్లు

కొల్లిపర: ఇసుకను అక్రమంగా రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సోమవారం సీజ్ చేసినట్లు ఆయన చెప్పారు. డ్రైవర్ల దగ్గర పత్రాలు లేకపోవడంతో కేసు నమోదు చేసి, ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానం మండలంలోని నది పరీవాహక ప్రాంతాలైన అత్తలూరివారిపాలెం, వల్లభాపురం, మున్నంగి, పిడపర్రు, పిడపర్తిపాలెం, కొల్లిపర, హనుమాన్‌పాలెం, అన్నవరం, గౌడపాలెం గ్రామాలకు మాత్రమే వర్తిస్తుందని చెప్పారు. మిగిలిన గ్రామాలకు గానీ, పట్టణాలకు గానీ ఉచితంగా ఇసుకను తరలించడానికి అనుమతుల్లేవని పేర్కొన్నారు. వేబిల్లు లేకుండా అనుమతులు లేని ప్రదేశాలకు ఇసుక తరలించే వారిపై కేసులు నమోదు చేసి, చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఇటీవల మండలంలో దొంగ వే బిల్లు ద్వారా ఇతర ప్రదేశాలకు ఇసుక తరలిస్తున్నారని సమాచారం ఉందని, ఇటువంటి వాటిపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టినట్లు ఆయన వెల్లడించారు.

వైభవంగా ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

తెనాలి టౌన్: స్థానిక చెంచుపేట అమరావతి కాలనీలోని శ్రీ గోదా పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. ఉత్సవాలను 9వ తేదీ నుంచి కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. భక్తులు దీక్ష కంకణం ధరించి స్వామికి పూజాధికాలు జరిపారు. అర్చకులు ప్రతి రోజూ స్వామికి నిత్య హోమం, మహా పూర్ణాహుతి, వసంతోత్సవం, చక్రతీర్థం తదితర పూజలు నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా మధ్యాహ్నం భక్తులకు భారీగా అన్నసంతర్పణ చేశారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యను పరిష్కరించాలి



కార్మికులతో మాట్లాడుతున్న వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు

తాడేపల్లిరూరల్ : బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమండ్ చేశారు. సోమవారం బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి, కార్మికులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీకి సంబంధించిన ప్రతి కార్మికుడికి రూ.50 లక్షలు ఇస్తామని, ఒకసారి రూ.30 లక్షలు ఇస్తామని యాజమాన్యం మాట్లాడుతోందన్నారు. కార్మికుల సమక్షంలో చర్చలు జరిపి, న్యాయం జరిగే విధంగా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా జోక్యం చేసుకుని సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించాలన్నారు. నాయకులు కె.ఆదినారాయణ, కార్మికులు నాగేశ్వరరావు, సుబ్బారావు, ఇమాంబి, మల్లేశ్వరి, రమాదేవి, దుర్గా భవాని, శారద, లక్ష్మి, గురవయ్య, సారమ్మ, ఆశీర్వాదం, యహోషువా, రిబ్కా పాల్గొన్నారు.

నెల రోజుల్లో స్వచ్ఛ మంగళగిరిగా చేద్దాం



చెత్తను తొలగిస్తున్న కమిషనర్ అలీమ్‌బాషా, సిబ్బంది

మంగళగిరి టౌన్: మంగళగిరి నగరపాలక సంస్థను స్వచ్ఛ మంగళగిరిగా చేసేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా కోరారు. కార్పొరేషన్ పరిధిలో స్వచ్ఛ మంగళగిరి పేరిట ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు ప్రాంతాల్లో అధికారులు, నాయకులతో కలసి ఇంటింటికీ వెళ్లి పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్పొరేషన్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, నాయకులతో ప్రతిజ్ఞ చేయించారు. అలీమ్‌బాషా మాట్లాడుతూ కాలువలో చెత్తను వేయవద్దని, ప్లాస్టిక్ సంచులు వాడవద్దని, తడి పొడి చెత్తను వేరుచేసి పారిశుద్ధ్య కార్మికులకు ఇవ్వాలని సూచించారు. నెల రోజుల పాటు 65 సచివాలయాల పరిధిలో స్పెషల్ డ్రైవ్ ద్వారా చెత్తను తొలగించడం, ప్రతి ఇంటికీ వెళ్లి పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలని ఉద్యోగులను ఆదేశించారు. 30 రోజుల పాటు అన్ని వార్డుల్లో పూర్తిస్థాయిలో చెత్తను తొలగించడం జరుగుతుందని తెలిపారు. స్వచ్ఛ మంగళగిరి కోసం 75 మంది పారిశుద్ధ్య కార్మికులను అదనంగా నియమించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శకుంతల, సెక్రటరి దివ్యకుమారి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్, అసిస్టెంట్ ఇంజనీర్ ప్రసన్నజ్యోతి, శానిటరి ఇన్‌స్పెక్టర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

మంచి మనిషి మాణిక్యవేలు



నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు

తాడికొండ: ఎందరో పేదలకు ఉపాధి కల్పించిన మంచి మనిషి మాణిక్యవేలు అని, ఆయన మరణం కుటుంబంతో పాటు అందరికీ తీరని లోటు అని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు అన్నారు. ఇటీవల మరణించిన ట్రిపుల్ ఎక్స్ సబ్బుల కంపెనీ అధినేత మాణిక్యవేలు కుమారుడు పర్వీన్ బాబు, కుటుంబ సభ్యులను ఆయన సోమవారం పరామర్శించారు. అనంతరం మాణిక్య వేలు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమిళనాడు ప్రాంతం నుంచి సాధారణ వ్యక్తిగా వచ్చిన మాణిక్య వేలు వ్యాపార రంగాన్ని నమ్ముకొని అట్టడుగు స్థాయి నుంచి పారిశ్రామిక వేత్తగా ఎదిగారని వివరించారు. వేల కుటుంబాలను పోషిస్తూ ఆదర్శ జీవితం గడిపారని కొనియాడారు.

పన్నుల వసూలుకు మున్సిపల్ సిబ్బంది కసరత్తు

తెనాలి అర్బన్: పురపాలక సంఘ పరిధిలో ఇంటి, ఖాళీ స్థల, కుళాయి పన్నులను ఈ నెల 31వ తేదీలోపు చెల్లించాలని మున్సిపల్ రెవెన్యూ అధికారి రాంప్రసాద్ కోరారు. పన్నుల వసూల్లో భాగంగా సోమవారం మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా షెడ్డులో సచివాలయ ఉద్యోగులతో బకాయిదారులకు ఫోన్‌లు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 73 శాతం వసూలు చేశామని చెప్పారు. 95 శాతం వసూలు చేయడాన్ని లక్ష్యం పెట్టుకుని పని చేస్తున్నామని ఆయన తెలిపారు. బకాయిదారులను ఉదోగ్యులు కూడా వ్యక్తిగతంగా కలిసి చెల్లించాలని కోరుతున్నట్లు చెప్పారు. ప్రజలు కూడా సహకరించాలని ఆయన కోరారు.

రేపు వాహనాల వేలం

తెనాలిరూరల్: తెనాలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన మూడు వాహనాలను ఈనెల 19వ తేదీన వేలం వేయనున్నట్టు ఎక్సైజ్ సీఐ ఏవీ చలం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బజాజ్ ఆర్‌ఈ ఆటో, సజుకీ యాక్సెస్, హోండా గ్లామర్ వాహనాలను వేలం వేస్తామన్నారు. ఆసక్తి గల వారు ఆ రోజు ఉదయం 11 గంటలకు తెనాలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో నేరుగా వేలంలో పాల్గొనవచ్చని చెప్పారు.

సర్వేలను వేగవంతం చేయాలి

కొల్లిపర: గ్రామాలల్లో నిర్వహిస్తున్న తొమ్మిది ప్రభుత్వ సర్వేలను గ్రామస్థాయి అధికారులు, సచివాలయం సిబ్బంది వేగవంతం చేయాలని ఎంపీడీవో వి.విజయలక్ష్మి ఆదేశించారు. సర్వేలపై సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ఇరవై గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పి– 4 సర్వే, వర్క్ ఫ్రం హోమ్, మిస్సింగ్ సిటిజన్స్, ఆధార్ లేని పిల్లలు, తోలు కళాకారుల సర్వే తదితరాలను అవతవకలు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో కొల్లిపర మండలం వెనుకబడి ఉందని, వారం రోజుల్లో మొదటి స్థానానికి వచ్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె చెప్పారు. ఇప్పటి వరకు పూర్తి చేసిన సర్వేల గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఎంటీఎంసీ కమిషనర్‌కు సత్కారం



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని కనకదుర్గ వారధి కింద ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా సోమవారం పర్యటించారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా పరిసరాలను పరిశీలించారు. స్థానిక భవానీ జల శంకర ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. కనకదుర్గ వారధి నుంచి ఆలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణం, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ మన్నెం రమేష్‌బాబు, ఆలయ కమిటీ చైర్మన్ శివన్నారాయణ, కార్యదర్శి గోపాలకృష్ణ, కమిటీ సభ్యులు బాలు, సుబ్బారావు, శ్రీనివాసరావు, బసవరాజు, సురేష్, వెంకటేశ్వరరావు, బాబ్జి పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరించాలి



ఫిరంగిపురం: అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కేతినేని అగస్టీన్ కోరారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించే అగ్రి గోల్డ్ బాధితుల కన్నీటి పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కూటమి నేతలు ఎన్నికల సమయంలో బాధితులను ఆదుకుంటామని ఇచ్చిన హామీని గుర్తుచేశారు. కానీ, నేటి వరకు ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. బాధితుల కష్టార్జితం వారికే దక్కాలని, ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండు చేశారు. అనంతరం ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ కరిముల్లా, మాదాను చిన్నప్ప, ధర్మవరపు కిశోర్, అలీభాయ్ పాల్గొన్నారు.